## క్లుప్తంగా

### నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

దుద్యాల్: మండల కేంద్రానికి సమీపంలో అటవీ ప్రాంతంలో గుట్టపై వెలిసిన కృష్ణ స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం అవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 30న ఆంజనేయ స్వామి వారి సింధూర అభిషేకం, జల కుంబాభిషేకం, పల్లకీ సేవ, అన్నదానం, 31న స్వామి వారికి ప్రత్యేక పూజలు, పల్లకీ సేవ తదితర కార్యక్రమాలు కొనసాగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

### కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

యాలాల: మండలంలోని అన్నసాగర్ గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సాయిరెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరిస్తా

జిల్లా ధార్మిక సెల్ ఇన్‌చార్జి డాక్టర్ రాజశేఖర్



మాట్లాడుతున్న రాజశేఖర్

అనంతగిరి: పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా . దార్మికసెల్ ఇన్‌చార్జి డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని రామయ్యగూడలో బీజేపీ నాయకులతో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, రాఘవేందర్, అశోక్, సంతోష్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### నాయీ బ్రాహ్మణ సంఘం కమిటీ ఎన్నిక



సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

షాద్‌నగర్: నాయీ బ్రాహ్మణ సంఘం ఫరూఖ్‌నగర్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం తాలుకా అధ్యక్షుడు రోమియో రమేశ్ ఆధ్వర్యంలో సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫరూఖ్‌నగర్ గౌరవాధ్యక్షులుగా పి.ప్రకాశ్, ఎలికట్ట శ్రీశైలం, మధురాపూర్ శ్రీనివాస్, అధ్యక్షుడిగా సమ్మెట శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా నర్సింహ, కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, కోశాధికారిగా మంచిర్యాల సురేశ్, ప్రచార కార్యదర్శులుగా నరేశ్, రమేశ్, కార్యదర్శులుగా భిక్షపతి, మహేశ్, దేవునిపల్లి రవి, సలహాదారులుగా విశాల్, మధు, చెన్నయ్య, నర్సింహ, అనిల్, ఆంజనేయులు, శ్రీనివాసులు, మంచిర్యాల వెంకటేశ్, మహేశ్, ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు తాలుకా అధ్యక్షుడు నియామకపత్రం అందజేసి వారిని సత్కరించారు.

### ఆత్మరక్షణకు కరాటే దోహదం

కొత్తూరు: యువతీ, యువకులు ఆత్మరక్షణకు తప్పకుండా యుద్ధవిద్యలు నేర్చుకోవాలని మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ అన్నారు. బోధివర్మ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు చేసిన పలు విన్యాసాలు చూపరులను అలరించాయి. అనంతరం ఆయనతో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరూ ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యుద్ధవిద్యలు నేర్చుకునే వారిలో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌యాదవ్, యాదయ్య, తేజ, భార్గవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వరిలో నారు ముఖ్యం



ఆలేడ్‌లో వారం రోజుల నారుమడి

**విత్తన ఎంపికలో జాగ్రత్త వహించాలి**

- నాసిరకంతో ఇబ్బందులు తప్పవు
- మేలు రకంతోనే అధిక దిగుబడి సాధ్యం

దుద్యాల్: పైరు దృఢంగా పెరగాలంటే విత్తనం బలంగా ఉండాలి. విత్తనం బలంగా లేకపోతే ఎన్ని ఎరువులు వేసినా పంట ఎదుగుదల, దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటుంది. మండలంలో రైతులు ప్రస్తుతం దమ్ము చేయడం, నారుమడుల పనుల్లో నిమజ్ఞమయ్యారు. నారు పోసే ముందు విత్తనాల ఎంపికలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి తులసి తెలిపారు. మండలంలో ప్రస్తుత సీజన్‌లో 10వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో చాలా మంది రైతులు వెదజల్లే పద్ధతిని అవలంభిస్తున్నారు. నారు మడుల విధానంలో మొలక శాతం తక్కువగా ఉన్నట్‌లైతే వరినారు కొరత ఏర్పడుతుంది. వెదజల్లిక విధానంలో వరి మొలక శాతం తక్కువగాఉంటే మొక్కల మధ్య దూరం పెరుగుతుంది. దీంతో మళ్లీ మధ్యమధ్యలో నాట్లు వేసుకోవల్సి వస్తుంది. ఈ సమస్యను అధికమించేందుకు విత్తనాల ఎంపికలో రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. వరి విత్తనాల్లో మొలక శాతాన్ని పరిశీలించి విత్తనాలు చల్లుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

**నాణ్యమైన విత్తనాలతో..**

రైతులు మొలక కట్టే ముందు విత్తనాలను ఎంపిక, నాణ్యతను ముఖ్య ప్రమాణంగా భావించాలి. విత్తనాలను ముందుగా పలుచని గుడ్డ తీసుకొని నాలుగు మడతలుగా చేసి 100 వరి గింజలను తీసుకుని 24 గంటల పాటు నీటిలో నానబెట్టాలి. తరువాత పొడి గుడ్డను తీసుకుని వాటిని పొడిగుడ్డలో వేసి గాలి పోకుండా చేసుకోవాలి. అలా నాలుగు నుంచి ఐదు రోజుల పాటు ఉంచాలి. 100 గింజల్లో 80 గింజల కంటే ఎక్కువగా మొలకెత్తితే అవి నాణ్యమైన విత్తనాలుగా భావించాలి. అలా ముందుగా పరిశీలించాకే మొత్తం విత్తనాలను నానబెట్టుకోవాలి. రైతులు మేలైన రకాలను ఎంపిక చేసుకోవడం ద్వారానే పైరు ఆరోగ్యంగా పెరుగుతుంది. దీంతో ఆశించిన దిగుబడులు సాధించొచ్చు.

**సూచనలు పాటించాలి**

రైతులు విత్తన ఎంపికలో మోసపోకుండా నాణ్యమైన, మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. అధికారుల సూచనల ప్రకారం సరైన సమయంలో నారు వేసుకుంటే అధికదిగుబడి సాధించొచ్చు.

– తులసి, వ్యవసాయ అధికారి

# జాతీయ భావాలను పరిరక్షించాలి

**జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి**

పరిగి: సమాజంలో దేశభక్తి, జాతీయ భావాలను ప్రేరేపించి పరిరక్షించాల్సిన బాధ్యత సాహిత్య కారులదేనని జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత గౌరవ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో జాతీయ సాహిత్య వన భోజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాచీన సాహిత్యం మొదలు, ఆధునిక సాహిత్యం వరకు సాహిత్యంలోని విలువలను సమాజానికి అందించి భారతీయ సాహిత్యాన్ని కాపాడాలన్నారు. ప్రజల వద్దకు సాహిత్యం చేరాలని సూచించారు. ఇందుకు ఆధునిక కవులు, రచయితలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. దేశభక్తి రచనలు విరివిగా రాయాల్సిన ధర్మం సాహిత్యకారులదేనన్నారు. తెలంగాణ చరిత్ర, సాహిత్యం చాలా గొప్పదన్నారు. తెలంగాణ కవులకు రచయితలు, సామాజిక, స్పృహ కల్గి ఉంటారన్నా రు. తెలంగాణ సాహిత్యాన్ని సంస్కృతిని కా పాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూ చించారు. ఈ కార్యక్రమంలో వక్తలు త్రిపురనేని హనుమాన్ చౌదరి, జాతీయ సాహిత్య పరిషత్ ప్రచార కార్యదర్శి ఆధ్యాత్మిక వేత్త భాస్కరయోగి, ఆంజనేయులు, రాజు, కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

# లింగబలిజ సంఘం బలోపేతానికి కృషి

- రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఈశ్వరప్ప
- నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర కేలండర్ ఆవిష్క రిస్తున్న ఈశ్వరప్ప తదితరులు

తాండూరు టౌన్: రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం తాండూరు శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ సంఘం బలోపేతానికి సభ్యులందరూ కృషి చేయాలన్నారు. కుల సభ్యుల అభ్యున్నతికి, సంక్షేమానికి చేయూతనివ్వాలన్నారు. బసవేశ్వరుని విగ్రహాలు స్థాపించి, ఆయన వచనాలను సమాజంలో వ్యాపింప జేయాలన్నారు. సంఘం తరుపున కమ్యూనిటీ హాల్ ఏర్పాటు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పటేల్ ఉదయ్‌శంకర్, రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రటరీ, దర్మిది ప్రభు, జిల్లా కోశాధికారి శివకుమార్, గాజుల శాంత్‌కుమార్, శివకుమార్, బస్వరాజు, శివరాజ్, కిరణ్, పటేల్ విజయ్, నరేష్, చంద్రకాంత్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

మర్పల్లి: ఆపదలో ఉన్న కార్యకర్తలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మర్పల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మధుకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఘణాపూర్ గ్రామానికి చెందిన సోషల్ మీడియా గ్రామ కో ఆర్డినేటర్ ఎండీ రహీం తండ్రి ఎండీ అఖిల్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వారు ఎండీ అఖిల్‌ను స్వగృహంలో కలిసి పరామర్శించి వైద్యఖర్చుల నిమిత్తం శ్రీకాంత్‌రెడ్డి రూ. 25 వేలు, మధుకర్ మరో రూ.25వేలు సాయం అందజేశారు. వారి వెంట మర్పల్లి మండల పరిషత్ కార్యాలయ మాజీ వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, ఖాజీ, దామస్తాపూర్ మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి, ఘణాపూర్ మాజీ ఎంపీటీసీ బిచ్చన్న తదితరులు ఉన్నారు.

**అనారోగ్యంతో..**

బూచన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యువకార్యకర్త కారెగుడ్ల ఎవాన్ వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురై నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మర్పల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మధుకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల కోసం రూ. 5వేలు అందజేశారు.

## క్రీడలతో ఆరోగ్యం



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కుల్కచర్ల: క్రీడలతో ఆరోగ్యం చేకూరుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద రావు, డీసీసీ ఉపాధ్యక్షులు భీంరెడ్డి పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ జాతీయభావం పెంపొందించుకోవాలని వారు సూచించారు. ఆది వారం కుల్కచర్ల మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చౌడాపూర్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. దేశభక్తి, క్రమశిక్షణ గల పౌరులను ఆర్‌ఎస్‌ఎస్ తయారుచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవి, శ్రీను, రాజు, ఆంజనేయులు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి

**అనంతగిరిలో..**

అనంతగిరి: క్రీడలతో శరీర ధారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్‌లోని శ్రీసత్య సాయి సేవా సంస్థల యువజన విభాగం ఆధ్వర్యంలో వికారాబాద్‌లోని ఎస్‌ఏపీ కళాశాల మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ ప్రాంతం నుంచి రాష్ట్ర, జాతీయ పోటీల్లో ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌ముదిరాజ్, సేవా స్థల కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణగౌడ్, బస్వరాజ్, మహేశ్, సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

◆ **పేదలను ఆదుకుంటా**

దోమ: గ్రామీణ పేదలను ఆదుకుంటానని పీసీసీ ఎస్‌ఐ డైరెక్టర్ యాదవరెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్య సాగర్ పేర్కొన్నారు. ఆదివారం దోమ మండల పరిధిలోని దోర్నాల్‌పల్లి తండాలో సేవ్య నాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ కాంగ్రెస్ నేతలతో కలసి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, పేదలను ఆదుకునేందుకు ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అనిల్, శ్రీనివాస్, దామోదర్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, మొగులయ్య, చంద్రనాయక్, తావురానాయక్, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఉపాధ్యాయ సంఘాల కార్యవర్గాలు ఎంపిక**

అనంతగిరి: వికారాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు గిరిజన ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు తిమ్యానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా రాజు, రమేశ్, బంటారం నేనావత్ ప్రకాశ్, తుకారం, మోమిన్‌పేటకు సర్దార్‌నాయక్, రామావత్ రాందాస్, ధారూర్‌కు విస్లావత్ శ్రీను, గోపాల్‌లను, కోట్‌పల్లికి నేనావత్ శ్రీను, కవిత, నవాబ్‌పేటకు నాన్య, బాబుసింగ్, మర్పల్లికి నీల్యా, హరిచందర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శిగా కల్యానాయక్, రాష్ట్ర నాయకులు పాండు, రవినాయక్, భాస్కర్ నాయక్, బాబ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ **రామకృష్ణకు పుడమి విద్యారత్న**

తాండూరు: తాండూరుకు చెందిన విద్యావేత్త పర్యాద రామకృష్ణ పుడమి విద్యారత్న అవార్డు అందుకున్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా ముదిగొండ పట్టణంలో పుడమి సాహితి కళావేదిక తెలంగాణ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని పురస్కారాలు అందజేశారు. ఈ అవార్డును పద్మశ్రీ వనజీవి రామయ్య, భక్తరామదాసు వారసులు కంచర్ల శ్రీనివాస్‌లతో పాటు పలువురు ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా తాండూరు పట్టణానికి చెందిన విద్యా వేత్త పర్యాద రామకృష్ణ విద్యా, సామాజిక రంగాలలో చేస్తున్న సేవలకు గాను పుడమి విద్యారత్న విశిష్ట సేవా పురస్కారం వరించింది. ఈ కార్యక్రమంలో పుడమి సాహితి వేదిక అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి, విద్యావేత్తలు, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### మండల స్థాయి టాలెంట్ టెస్టు నేడు

బొంరాస్‌పేట: పదోతరగతి విద్యార్థులకు సోమవారం మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్టు నిర్వహించనున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి 3వరకు ఒక గంటపాటు నిర్వహించనున్న పరీక్షకు మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు హాజరుకావాలని ఎంఈఓ హరిలాల్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి జనవరి 4న నిర్వహించనున్న జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్టుకు ఎంపికవుతారని తెలిపారు.

### అనారోగ్యంతో ఖాసీంసాబ్ మృతి

70 ఏళ్లుగా మొల్లాగా సేవలు



ఖాసీంసాబ్ (ఫైల్)

బషీరాబాద్: మండలంలోని ఎక్మాయి గ్రామానికి చెందిన ముస్లిం మతగురువు, షాబుల్లా హుస్సేన్‌దర్గా మొల్లా ఖాసీంసాబ్ శనివారం రాత్రి కన్నుమూశాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తాండూరు నియోజకవర్గంలో ప్రసిద్ధి గాంచిన ఎక్మాయి గట్టు దర్గాకు 70 ఏళ్లుగా మొల్లాగా పనిచేశాడు. కర్ణాటక, తెలంగాణతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు దర్గాదర్శనానికి వచ్చి మొల్లా ఖాసీంసాబ్ ఆశీస్సులు తీసుకునే వారని కుటుంబ సభ్యులు గుర్తు చేశారు. ఆదివారం దర్గా దగ్గర నిర్వహించిన అంత్యక్రియలకు నియోజకవర్గంలోని ముస్లిం మతపెద్దలు, ఆయన అభిమానులు, దర్గా భక్తులు భారీగా తరలివచ్చారు. ఆయన మృతి గ్రామానికి తీరనిలోటన్నారు.

### 'హెచ్‌ఎంపై దాడి హేయమైన చర్య'

షాద్‌నగర్‌రూరల్: జిల్లాలోని మహేశ్వరం మండలం తుక్కుగూడలో గెజిటెడ్ హెచ్‌ఎంపై భజరంగ్‌దళ్ నాయకులు, అయ్యప్ప భక్తుల ముసుగులో దాడి చేయడం హేయమైన చర్య అని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తి మార్గాన వెళ్తున్న అయ్యప్ప భక్తులు బీఆర్‌ఎస్, బీజేపీ కుట్రలో భాగస్వాములు కావొద్దని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల కాళ్లు మొక్కాలని చెప్పడం ఏ విధమైన సంస్కృతికి నిదర్శనమని ప్రశ్నించారు. హెచ్‌ఎం దళితుడైనందునే ఇలా దాడి చేశారన్నారు. హెచ్‌ఎంపై దాడి జరిగి మూడురోజులు గడుస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

# ముగిసిన ఎల్లమ్మ జాతర



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



బోనాలతో మహిళలు

యాలాల: మండలంలోని ముద్దాయిపేట రేణుక ఎల్లమ్మమాత జాతరోత్సవాలు ఆదివారం ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ ఉత్సవాల్లో భక్తులు భారీ సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం రాత్రి చుక్కబోనాల అనంతరం నిర్వహించిన కాంతార, కాళీమాత, పోతురాజుల విన్యాసాలు భక్తులను కనువిందు చేశాయి.

**ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి**

ఎల్లమ్మ జాతర ఉత్సవాల్లో చివరిరోజు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు. ఎల్లమ్మ మాత ఆశీర్వాదంతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త దేవగారి రాములు, మాజీ సర్పంచ్‌లు విఠలయ్య, బిచ్చన్నగౌడ్, కృష్ణయ్యగౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు భానుప్రసాద్‌గౌడ్, ఉపాధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి సంపత్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు వాసిద్ ఖాన్, ఆరిఫ్ హుస్సేన్, బస్వరాజ్, నర్సింహులు, రమేష్‌కుమార్, రాజు చారి తదితరులు పాల్గొన్నారు.

**మైసమ్మ తల్లికి బోనాలు**

కొడంగల్ రూరల్: మైసమ్మ తల్లి కరుణించమ్మ అంటూ మండల పరిధిలోని బుల్కాపూర్ గ్రామంలో మహిళలు ఆదివారం బోనాలు సమర్పించారు. గ్రామంలో ఉదయం నుంచి పండుగ వాతావరణం నెలకొంది. ఇతర గ్రామాల నుంచి వచ్చిన బంధువులతో సందడి వాతావరణం నెలకొంది. సాయంత్రం మైసమ్మ తల్లికి మహిళలు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

# బహిరంగ సభను విజయవంతం చేయండి



జెండా ఆవిష్కరిస్తున్న రామస్వామి, నాయకులు

**సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి**

మొయినాబాద్: నల్గొండలో నిర్వహించే పార్టీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మండలంలోని పెద్ద మంగళారం గ్రామంలో ఆదివారం పార్టీ వంద వసంతాల వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన జెండావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పేదప్రజలు, కార్మికులు, కర్షకుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. రైతాంగ సాయుధ పోరాటంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందన్నారు. దాదాపు పది లక్షల ఎకరాల భూమి పేదలకు పంచి, 4వేల గ్రామాలను వెట్టిచాకిరి నుంచి విముక్తి చేయించినట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీన నల్గొండలో నిర్వహించే బహిరంగ సభలో కార్మికులు, కర్షకులు, రైతులు, ప్రజాసంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు ఎం.ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, నాయకులు సత్తయ్య, వెంకటయ్య, మల్లేశ్, ఎ.శ్రీనివాస్, సుధాకర్‌గౌడ్, అంజయ్య, యాదగిరి, యశోద, లక్ష్మణ్, బాల్‌రాజ్, వెంకటేశ్, నర్సింలు తదితరులు ఉన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మోమిన్‌పేట: ఉపాధ్యాయులతో విద్యార్థులు



అనంతగిరి: పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

మోమిన్‌పేట: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. మోమిన్‌పేట ఉన్నత బాలుర పాఠశాలలో 1992–93 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఒక దగ్గరకు చేరారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు పలకరించుకుని కష్టసుఖాలను తెలుసుకున్నారు. కుటుంబ జీవితం గురించి అడిగి వివరాలు కనుకున్నారు. ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో స్థిరపడిన స్నేహితులు ఒకరినొకరు కుశల ప్రశ్నలు వేసుకున్నారు. పాతజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాలలో చేసిన అల్లరి పనులు తలుచుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు జగన్నాధం, వెంకట్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వీరన్నలను శాలువాకప్పి సన్మానించారు.

**సమాజాభివృద్ధిలో ముందుండాలి: శాంతాసిన్హా**

అనంతగిరి: సమాజ అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు ముందుండాలని యంవీఎఫ్ (మామిడిపూడి వెంకటరంగయ్య ఫౌండేషన్) సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ శాంతాసిన్హా పేర్కొన్నారు. వికారాబాద్ పట్టణంలోని తేజ ఫంక్షన్ హాల్లో యంవీఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతాసిన్హా మాట్లాడుతూ చదువుకు దూరంగా ఉన్న వేలమంది బాలకార్మికులను ఒకదగ్గరకు చేర్చి వారిని తీర్చిదిద్దిన ఘనత యంవీఎఫ్‌కే దక్కుతుందన్నారు. బాలకార్మికులుగా ఉన్న విద్యార్థులు ఉత్తమ విద్యార్థులుగా రాణించి అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలిచారని గుర్తు చేశారు. కులమతాలకు అతీతంగా ఈ ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఫౌండేషన అభ్యున్నతికి పాటుపడతామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో యంవీఎఫ్ జాతీయ కోఆర్డినేటర్, రాష్ట్ర విద్యాశాఖ సలహాదారుడు వెంకట్‌రెడ్డి, యండీ విక్రం, కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు శివరాములు, హరిహరరెడ్డి, మాణిక్యం, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.